సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య
ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. - 9లో



పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా
జలాల్‌పురాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం
35°/18°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పశు సంపదలో మొదటి స్థానంలో నిలపాలి

భువనగిరి : పశు సంపదలో ఉమ్మడి నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని పశుగణాభివృద్ధి చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి పేర్కొన్నారు. భువనగిరిలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సోమవారం గోపాల మిత్రలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోపాలమిత్రలు గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పశువులకు కృత్రిమధారణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కృష్ణ, ఉమ్మడి నల్లగొండ జిల్లా డీఎడీఏ ఈఓ డాక్టర్ పాశం శ్రీనివాస్‌రెడ్డి, గోపాలమిత్రల సూపర్‌వైజర్లు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

అనంతారం పాఠశాల ల్యాబ్ పరిశీలన



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

భువనగిరి : మండలంలోని అనంతారం ప్రభుత్వ పాఠశాలలను సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సదర్శించారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ నెల 28న సీఎం కార్యాలయ సెక్రటరీ స్మితాసబర్వాల్ ల్యాబ్‌ను ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి భరణి ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



కార్యకర్తలతో మాట్లాడుతున్న కుంభం

బీబీనగర్ : కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేయాలని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బీబీనగర్ మండలంలోని నెమురగొముల, రాయరావుపేట, జియాపల్లి తదితర గ్రామాల్లో ఆయన సోమవారం కార్యకర్తలను కలిసి వారి బాగోగులు తెలుసుకున్నారు.పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఎవ్వరూ అధైర్యపడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి, నాయకులు సుర్వి వేణుగౌడ్, సందిగారి బస్వయ్య, గోళి నరేందర్‌రెడ్డి, కొలిశెల్మి శ్యామ్, పెంటయ్యగౌడ్, ప్రభాకర్, యూత్ నాయకులు రాజేందర్, వాసు, మధు, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లయినా అమలుకాని హామీలు



మాట్లాడుతున్న వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు

అడ్డగూడూరు : సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలకు హామీలిచ్చి ఆరేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదని వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి వీరన్న తెలిపారు. సోమవారం ఆయన అడ్డగూడూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రెగ్యులర్ చేస్తామని, పదోన్నతులు కల్పిస్తామని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీలు ఇచ్చారని పేర్కొన్నారు.అంతేకాకుండా 2020 సెప్టెంబర్ 9న నూతన రెవెన్యూ చట్టం తీసుకువస్తూ వీఆర్వో వ్యవస్థను రద్దు చేస్తూ వీఆర్‌ఏలకు పేస్కేల్ ఇస్తామని, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. మనుగోడు ఎన్నికకు ముందు సమ్మె చేస్తున్న వీఆర్‌ఏలకు ఉప ఎన్నిక ముగియగానే జీఓ విడుదల చేస్తామని అప్పటి సీఎస్, మంత్రి కేటీఆర్ సమ్మె విరమింపజేశారని గుర్తు చేశారు. ఇప్పటికైనా హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో మళ్లీ ఆందోళనబాట పడుతామని హెచ్చరించారు.

ధరణిలో తప్పులు సవరించాలని వినతి

భువనగిరి టౌన్ : ధరణి పోర్టల్‌లో తప్పులు సవరించి రైతులందరికీ పాస్ పుస్తకాలు అందజేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రజుమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పైళ్ల యాదిరెడ్డి, కార్యదర్శి కొల్లూరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహినిగా వెలిగి.. ఎదుర్కోలుకు కదిలి



యాదాద్రి క్షేత్ర బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం జగన్మోహినిగా దర్శనమిచ్చి.. రాత్రి అశ్వవాహనంపై ఎదుర్కోలుకు తరలుతున్న నారసింహుడు



ఎదుర్కోలు మహోత్సవంలో స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఎదురు‘చూపు’లేనా?

దూరదృష్టి లోపం ఉన్నవారికి అద్దాల పంపిణీలో జాప్యం

- నెల రోజులు కావస్తున్నా జిల్లాకు చేరని అద్దాలు
- 12,252 మంది ఎదురుచూపు
- రెండో విడతలో 1,05,936 మందికి కంటి పరీక్షలు
- 19,951 మందికి రీడింగ్ గ్లాసులు అందజేత



కంటి వెలుగు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పరీక్షలు, అద్దాల పంపిణీ ఇలా..

18 ఏళ్లు పైబడిన వారు	సోమవారం నాటికీ పరీక్షలు
6,07,337	1,05,936
రీడింగ్ గ్లాస్‌లు	**దూరపు చూపు**
19,951	1,936

సాక్షి, యాదాద్రి : రెండో విడత కంటి వెలుగు పథకంలోనూ లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తున్నా దూరదృష్టి లోపం ఉన్న వారికి సకాలంలో అద్దాలు అందడం లేదు. జనవరి 19వ తేదీన జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడిచిన 40 రోజుల్లో 1,05,936 మందికి పరీక్షలు చేశారు. చూపు మందగించడం, డబుల్ విజన్, బ్లర్ వంటి లోపాలను గుర్తిస్తున్నారు. అయితే రీడింగ్ అద్దాలు, మందులు వెంటనే పంపిణీ చేస్తున్నా దూరపుచూపునకు సంబంధించిన గ్లాసులు ఆలస్యం అవుతున్నాయి.

లక్ష్యం 6,07,337 మంది

జనవరి 19న ప్రారంభమైన కంటి వెలుగు కార్యక్రమం జూన్ 15వ తేదీ వరకు వంద రోజుల పాటు కొనసాగనుంది. జిల్లాలో వైద్యారోగ్యశాఖ లెక్కల ప్రకారం 8,80,199 మంది జనాభా ఉంది. పరీక్షలు చేయడానికి 18 ఏళ్ల వయసు పైబడిన 6,07,337 మందిని గుర్తించారు. 421 గ్రామ పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీల్లో 104 వార్డుల్లో దశల వారీగా కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం నాటికి 1,05,936 మంది పరీక్షలు చేశారు. ఇందులో 71,797 మందికి ఎలాంటి కంటి జబ్బులు లేనట్లు తేలింది. ఇక 19,951 మందికి దగ్గరి చూపు సమస్య ఉండగా వారందరికీ రీడింగ్ గ్లాసులు పంపిణీ చేశారు. దూరపుచూపు లోపం ఉన్న వారు 14,188 మంది ఉండగా కేవలం 1,936 మందికి మాత్రమే గ్లాస్‌లు అందజేశారు. కంటి పరీక్షల చేయడానికి ప్రత్యేకంగా 34 బృందాలను ఏర్పాటు చేశారు.

గడువు దాటినా ఇస్తలేరు

కంటి పరీక్షలు నిర్వహించి దగ్గరి చూపు ఉన్న వారికి వెంటనే రీడింగ్ గ్లాస్‌లు ఇస్తున్నారు. దూరదృష్టిలోపం ఉన్నవారికి మాత్రం అద్దాల కోసం 15 రోజులు గడువు పెడుతున్నారు. కానీ, రోజులు కావస్తున్నా అందడం లేదు.

ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు

కంటి పరీక్షలు చేయించుకున్న లబ్ధిదారులు, వారికి ఉన్న కంటి జబ్బులు, అద్దాలు, మందుల పంపిణీ వివరాలను వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రస్తుతానికి శస్త్రచికిత్సలు లేనప్పటికీ ఒక వేళ ప్రభుత్వం నుంచి చేయాలని ఆదేశాలు వస్తే లబ్ధిదారులకు సమాచారం ఇవ్వడానికి వారి సెల్‌ఫోన్ నంబర్లను తీసుకుంటున్నారు.

ఆస్పత్రులకు క్యూ

కంటి వెలుగు శిబిరాల్లో లోపాలు బయటపడ్డవారు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ప్రధానంగా శస్త్రచికిత్స అవసరం ఉన్నవారు హైదరాబాద్ సరోజినీదేవి కంటి ఆస్పత్రి, ప్రైవేట్ హాస్పిటళ్లను ఆశ్రయిస్తున్నారు. సొంతంగా డబ్బులు చెల్లించి చేయించుకుంటున్నారు. శస్త్రచికిత్సలు కూడా ప్రభుత్వమే నిర్వహించాలంటున్నారు.

రెండు, మూడు రోజుల్లో వస్తాయి



దూరపుచూపు అద్దాల కోసం 20 రోజుల సమయం పడుతుంది. అవసరమైన అద్దాలు కావాల్సిన వారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి, క్యూఆర్ కోడ్ ఇస్తున్నాం. ప్రభుత్వం నుంచి జిల్లాకు అద్దాలు రాగానే పీహెచ్‌సీలకు పంపిస్తాం. అక్కడినుంచి గ్రామాలకు పంపి ఏఎన్‌ఎంల ద్వారా బాధితులకు పంపిణీ చేస్తాం. రెండు మూడు రోజుల్లో దూరదృష్టి లోపం ఉన్నవారి అద్దాలు జిల్లాకు రానున్నాయి.

–డాక్టర్ మల్లికార్జున్, జిల్లా వైద్యాధికారి

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ముగియనున్న ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీకాలం
- జిల్లాకు మరోసారి అవకాశం దక్కేనా..



ఎలిమినేటి కృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి: భువనగిరి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీకాలం మార్చితో ముగియనుంది. ఎన్నికల సంఘం ఎమ్మెల్యే కోటాలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్‌ను సోమవారం సాయంత్రం విడుదల చేసింది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన కృష్ణారెడ్డి పదవీకాలం మార్చిలో ముగియనుండడంతో మరోసారి జిల్లాకు ఎమ్మెల్సీ పదవి వస్తుందా అన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఇప్పటికే యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తమకు అవకాశం ఇవ్వాలని అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్ద ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే మరోసారి అవకాశం కోసం ఎలిమినేటి కృష్ణారెడ్డి కుటుంబం ఎదురు చూస్తోంది.

ఆశావహుల ప్రయత్నాలు

మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, సీనియర్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, నేతి విద్యాసాగర్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్ మరికొందరు నాయకులు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే, ఈ పదవికి రాష్ట్రం యూనిట్‌గా అభ్యర్థిని ఎంపికచేసే అవకాశం ఉన్నందున అధినేత కేసీఆర్ చూపు ఎవరిమీద ఉంటుందోనన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. అయితే శాసనసభ ఎన్నికల ముందు వస్తున్న ఈ ఎమ్మెల్సీ ఎన్నికకు అభ్యర్థులు ఎంపిక సామాజికవర్గ సమీకరణల మీద ఆధారపడి ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

గ్రామ పంచాయతీలకు 11వ ఆర్థిక సంఘం నిధులు

- 9.10 కోట్లు విడుదల.. ఖాతాల్లో జమ

రామన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 11వ ఆర్థిక సంబంధ నిధులు విడుదల చేసింది. మొత్తం రూ.9,10,62,187 రాగా సోమవారం పంచాయతీల ఖాతాల్లో జమ చేసింది. సాంకేతిక సమస్యల కారణంగా అడ్డగూడూరు మండలంలోని 15 గ్రామ పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ కాలేదు. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారం కానుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్రం విడుదల చేసిన 11 ఆర్థిక సంఘం నిధులతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పంచాయతీలకు కాస్త ఊరట కలిగింది.

వీటికి వినియోగం

ఈ నిధులను మల్టీపర్పస్ కార్మికుల వేతనాలు, కరెంట్ బిల్లు, ట్రాక్టర్ ఈఎంఐల చెల్లింపు, హరిత హారం, గ్రామ నర్సరీల నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయినేజీల నిర్మాణం, మంచినీటి సరఫరాకు వినియోగించుకునే వెసులుబాటు కలిగింది.

1న భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్'

ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

భూదాన్‌పోచంపల్లిమున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో మార్చి 1వ తేదీ (బుధవారం) 'సాక్షి' బుధవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 77801 54989



ఎస్.భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, భూదాన్‌పోచంపల్లి

అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భువనగిరిటౌన్ : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి వస్తుంటారని, వారు ఇచ్చిన వినతులను నిర్లక్ష్యం చేయవద్దన్నారు.వివిధ సమస్యలపై 69 వినతులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందులో అధికంగా 47అర్జీలు రెవెన్యూకు సంబంధించినవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- పుట్టపాక చేనేత సహకార సంఘంలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ చేయడానికి తొమ్మిది నెలల క్రితం నియమించిన కమిటీ జాప్యం చేస్తుందని సొసైటీ సభ్యురాలు ఏ.నవనీత ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణకు ఆదేశించాలని కోరారు.
- భువనగిరిలోని బైపాస్‌రోడ్డు సింగన్నగూడెం చౌరస్తా వద్ద అండర్‌పాస్ నిర్మించాలని కోరుతూ టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు విన్నవించారు. ఈ చౌరస్తా వద్ద ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయని, ఇప్పటి వరకు 30 మంది ప్రాణాలు కోల్పోయారని, ఎంతో మంది క్షతగాత్రులయ్యారని పేర్కొన్నారు.

ప్రజావాణికి హాజరుకాని అధికారులు

తమ సమస్యలు చెప్పకోవడానికి ప్రజావాణికి వస్తున్న ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండడంతో లేదు. అధికారుల తరఫున వారి సహాయకులు హాజరవుతున్నారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో ఒకరిద్దరు జిల్లా అధికారులు మినహా మిగతావారు రాలేదు. ప్రజావాణి రోజు ఎలాంటి పర్యటనలు, సమావేశాలు పెట్టుకోవద్దన్న నిబంధనలు ఉన్నాయి. అయినా వాటిని అధికారులు బేఖాతరు చేస్తున్నారు. దీంతో అర్జీదారులు సకాలంలో సమస్యలు పరిష్కారం కాక పదే పదే కలెక్టరేట్‌కు వస్తున్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, డీసీపీ

భువనగిరి : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భువనగిరిలోని ఇండోర్ స్టేడియం వద్ద సోమవారం శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 284 జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బంజారా జాతి విద్య, సామాజికంగా ఇంకా ఎదగాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. భువనగిరిలో బంజారా భవన్ కోసం స్థలం కేటాయిస్తే తన వంతు సహకారం అందిస్తానన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలన్నారు. డీసీపీ రాజేష్‌చంద్ర, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచంద్రునాయక్ మాట్లాడారు. అనంతరం ప్రీతి మృతికి సంతాపసూచకంగా మౌనం పాటించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బీకునాయక్, ప్రణాళిక అధికారి మాన్యానాయక్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నవీన్‌కుమార్, డీఆర్‌డీఓ మందడి ఉపేందర్‌రెడ్డి, ఆలిండియా బంజారా సేవా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమ్లాల్, కేతావత్ సోమ్లానాయక్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, ఎంపీపీ నిర్మల, బీబీనగర్ ఎంపీపీలు సుధాకర్, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ కొల్పుల అమరేందర్, జిల్లా ట్రెజరీ అధికారి సురేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సైఫ్‌కు ఉరే సరి



వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన సైఫ్‌ను ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ భువనగిరిలో రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు, చిత్రంలో పీవీ శ్యాంసుందర్‌రావు, హరిశంకర్‌గౌడ్ తదితరులు

కుక్కలు, కోతులను తరలించండి

- డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయి
- నివాసగృహాలపై విద్యుత్ తీగలు తొలగించాలి
- సమస్యలపై సాక్షి ఫోన్ ఇన్‌లో మొరపెట్టుకున్న మోత్కూరు ప్రజలు
- పరిష్కారానికి హామీ ఇచ్చిన మున్సిపల్ కమిషనర్



ఫోన్‌లో ప్రజల సమస్యలు వింటున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

మోత్కూరు : పట్టణంలో కుక్కలు, కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. ప్రధానంగా కుక్కలు రోడ్లపై, వీధుల్లో గుంపులుగుంపులుగా ఉంటున్నాయి. దారిన వెళ్లేవారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. కోతులు ఇళ్లలోకి ప్రవేశించి వస్తువులు, ఆహారపదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. పారిశుద్ధ్య సమస్య ఉంది. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు కొన్ని ప్రాంతాల్లోనే ఉన్నాయి.. అంతటా నిర్మించాలని మోత్కూరు పట్టణవాసులు తెలియజేశారు. మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌తో సోమవారం సాక్షి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో వారు వివిధ సమస్యలపై మొరపెట్టుకున్నారు. కమిషనర్ వారి సమస్యలు విని సమాధానం చెప్పారు. తమ పరిధిలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఇతర శాఖల సమస్యలపై సంబంధిత అధికారులకు లేఖలు రాస్తామని హామీ ఇచ్చారు.

ప్రశ్న : పట్టణంలో కుక్కలు, కోతలు బెడద తీవ్రంగా ఉంది. గుంపులుగుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వృద్ధులు, పిల్లలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి.

–అవిశెట్టి అవిలుమల్లు, గడ్డం నర్సింహ, మెంట ఎల్లేష్, బయ్యని గిరిప్రసాద్, టి.కీర్తి, బయ్యని రాజు

కమిషనర్ : కుక్కలు, కోతులు ప్రధాన సమస్యగా మారింది వాస్తవమే. కుక్కలను జంతు జనన నియంత్రణ కేంద్రాలకు, కోతులను పట్టి అటవీ ప్రాంతానికి తరలించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈ విషయంపై మున్సిపల్ పాలకవర్గంలోనూ చర్చిస్తాం.

ప్రశ్న : సినిమా థియేటర్ వెనుక వైపు చెత్త వాహనం రోజూ వస్తలేదు. ఖాళీ స్థలాల్లో చెత్తవేయడంతో దుర్వాసన వస్తుంది. –బొడిగె శ్రీను

కమిషనర్ : చెత్త వాహనం రోజూ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. ఖాళీ స్థలాల్లో చెత్త వేసే వారికి నోటీసులు జారీ చేస్తాం.

ప్రశ్న : 11వ వార్డులోని అన్నెపువాడలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేవు.

–మొరిగాల వెంకన్న, కారుపోతుల వెంకన్న, బోయిని వెంకన్న, మచ్చగిరి

కమిషనర్ : అన్నెపువాడకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వల్ల జాప్యం జరుగుతోంది. మరో కాంట్రాక్టర్‌కు అప్పగిస్తాం.

ప్రశ్న : ప్రతి ఆదివారం జరిగే సంత మూతపడింది. తిరిగి పునరుద్ధరించాలి. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను రక్షించాలి. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు చేయాలి.

–బయ్యని రాజు

కమిషనర్ : పాలకవర్గంతో చర్చించి అంగడి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. హోటళ్లు, ఇతర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించనివారికి జరిమానాలు విధిస్తాం.

ప్రశ్న : ఇందిరానగర్ కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి.

–కారుపోతుల వెంకన్నగౌడ్

కమిషనర్ : రేషన్ షాప్ ఏర్పాటు విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

ప్రశ్న : అంబేద్కర్ చౌరస్తా, అన్నెపువాడకాలనీ ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారిన రైస్‌మిల్లును తరలించాలి.

–మొరిగాల నరేష్, మొరిగాల వెంకన్న

కమిషనర్ : మిల్లును తరలించే అధికారం మాకు లేదు. ఇండస్ట్రియల్ అధికారికి ఫిర్యాదు చేయాలి.

ప్రశ్న : ఆరెగూడెం రోడ్డు వైపు ఏపీజీవీబీ సమీపంలో నిర్మిస్తున్న డ్రెయినేజీ సగంలోనే నిలిచిపోయింది. దీంతో మురుగు నీరు బయటకు వచ్చి దోమల సమస్య తీవ్రమవుతోంది. –అనంతుల వెంకటేశ్వర్లు

కమిషనర్ : గ్రామీణ వికాస్ బ్యాంకు నుంచి పద్మావతి కాలనీ వరకు డ్రెయినేజీని పూర్తిస్థాయిలో నిర్మిస్తాం. నిధులు కూడా మంజూరయ్యాయి. బయటకు వస్తున్న మురుగునీటిని తొలగిస్తాం.

ప్రశ్న : ఆరెగూడెంలో పలు నివాస గృహాలపైనుంచి 11కేవీ విద్యుత్ లైన్ వెళ్తుంది. ఉరుములు, మెరుపులు, వర్షాలు వచ్చినప్పుడు తీగలు ప్రమాదకరంగా మారుతున్నాయి.

–కన్నెబోయిన కృష్ణ, చేకూరి నర్సింహ

కమిషనర్ : సమస్య పరిష్కారం కోసం విద్యుత్ శాఖ అధికారులకు లేఖ పెడుతాం.

ప్రశ్న : అంబేద్కర్ చౌరస్తాలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ ఎదురు గల్లీలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది.

–మెరుగు రాజశేఖర్

కమిషనర్ : త్వరలో నూతన డ్రెయినేజీ నిర్మిస్తాం.

ప్రశ్న : సినిమా థియేటర్ వెనుక ప్రాంతంలో పందుల బెడద ఉంది.

–ఆర్.శ్రీనివాస్

కమిషనర్ : పట్టణ నుంచి పందులను తరలించడానికి చర్యలు తీసుకుంటాం. తొలుత పందుల యజమానులకు నోటీసులు ఇస్తాం. స్పందించకపోతే పట్టి తరలిస్తాం.

ప్రశ్న : శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న కాలనీలో డ్రెయినేజీ నీరు రోడ్డుపైకి వస్తుంది. –ఆరె శ్రీనివాస్

కమిషనర్ : ఆ ప్రాంతాన్ని పరిశీలించి మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతాం.











నేడు యాదగిరీశుడి కల్యాణం

- రాత్రి కల్యాణోత్సవంలో పాల్గొననున్న మంత్రులు,
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు


మాఢ వీధిలో స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం


అశ్వవాహనం, ప్రత్యేక పల్లకిపై స్వామి అమ్మవారి ఊరేగింపు

యాదగిరిగుట్ట: యాదగిరీశుని కల్యాణ మహోత్సవ నిర్వహణకు ఆలయ అధికారులు, ఆచార్యులు, ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశేష పర్వమైన కల్యాణోత్సవం మంగళవారం రాత్రి 8గంటల నుంచి ప్రారంభం కానుంది. ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చే వీవీపీలు, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

కల్యాణోత్సవం ఇలా..

ప్రధానాలయంలో రాత్రి 7.30గంటలకు గజ వాహన సేవపై స్వామి వారు పెళ్లి కొడుకుగా ముస్తాబై మాఢ వీధుల్లో ఊరేగుతూ 8గంటలకు మండపానికి చేరుకుంటారు. ఆచార్యులు, వేద పండితులు పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణ వేడుకను ప్రారంభిస్తారు. తుల లగ్నంలో అమృత ఘడియల్లో రాత్రి 9.30గంటలకు స్వామి వారు అమ్మవారికి మాంగళ్యధారణ గావిస్తారు.

ముస్తాబు అవుతున్న ఆలయం

స్వామి అమ్మవార్ల కల్యాణం జరిగే బ్రహ్మోత్సవ మండపాన్ని పూల అలంకరణతో సిబ్బంది తీర్చిదిద్దుతున్నారు. ఇక తూర్పు మాఢ వీధిలో భక్తులు, వీఐపీలు కూర్చొని కల్యాణాన్ని తిలకించే విధంగా ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. క్యూకాంప్లెక్స్, ఉత్తర రాజగోపురం ముందు ఖాళీ స్థలాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్స్‌లో కల్యాణం తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకకు రాష్ట్ర మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితాఇంద్రారెడ్డి, సీఎస్ శాంతికుమారితో పాటు 10 మంది ఐఏఎస్ అధికారులు హాజరుకానున్నట్లు ఈఓ గీతారెడ్డి తెలిపారు.

జగన్మోహినిగా నారసింహుడు

యాదగిరీశుడి ఉత్సవాలు సోమవారం నాటికి ఏడవ రోజుకు చేరాయి. కల్యాణోత్సవానికి ముందస్తుగా పెళ్లి చూపుల పర్వం జరుపుకున్న స్వామి వారు ఉదయం జగన్మోహిని రూపం దాల్చాడు. రాత్రి అశ్వవాహనంపై నారసింహుని ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు.

అశ్వవాహనంపై స్వామివారు.. ముత్యాల పల్లకిపై అమ్మవారు..

యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన ఎదుర్కోలు ఉత్సవం వేద మంత్రోచ్చారణలతో జరిగింది. శ్రీలక్ష్మీ దేవితో నారసింహుని కల్యాణోత్సవంలో భాగంగా పెళ్లి చూపుల తతంగాన్ని నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు అశ్వవాహనంపై స్వామిని, ముత్యాల పల్లకిపై అమ్మవారిని అలంకరించి ప్రధానాలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం తూర్పు రాజగోపురం ముందు గల మాఢ వీధిలో పశ్చిమ ముఖంగా కూర్చోబెట్టి, అమ్మవారిని తూర్పు ముఖంగా అధిష్టించారు. దీంతో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చకులు, ఇతర అధికారులు స్వామి అమ్మవార్లకు ఇరు పక్షాలుగా వీడిపోయి పెద్దలుగా వ్యవహరించారు. ఇరువురి గుణగణములను ఆచార్యులు చర్చించుకున్నారు. శ్రీస్వామి వైపు ఉన్న వారికి, అమ్మవారి పక్షాన ఉన్న వారికి గుణగణములు, ఆదాయ, వ్యయాలు, తదితర అంశాలను వివరించారు. అనంతరం స్వామి అమ్మవార్ల తిరు కల్యాణ వేడుకకు సమయం నిర్ణయించారు. మంగళవారం రాత్రి 8గంటలకు అమ్మవారిని వివాహం చేసుకునేందుకు ముహూర్తం నిర్ణయించారు. కాగా, కొండపై వివిధ కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


ప్రదర్శన ఇస్తున్న కళాకారులు


పట్టువస్త్రాలు చూపెడుతున్న ఆచార్యులు


రంగులు రుద్దుకుంటున్న విప్ సునిత, ఈఓ

పట్టువస్త్రాలు అందజేత


ఈఓకు పట్టువస్త్రాలు అందజేస్తున్న వడ్లోజు వెంకటేష్

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో నిర్వహించే స్వామి అమ్మవార్ల తిరు కల్యాణ వేడుకకు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన కుటుంబం తరపున పంపించిన పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వడ్లోజు వెంకటేష్ సోమవారం ఆలయ ఈఓ గీతారెడ్డికి అందజేశారు. స్వామివారి జగన్మోహిని అలంకార సేవ ఊరేగింపు పూర్తి అయిన తరువాత ప్రథమ ప్రాకార మండపంలో అందించారు.

కల్యాణోత్సవ ఏర్పాట్లు పరిశీలన


పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగే స్వామి అమ్మవార్ల తిరుకల్యాణోత్సవ ఏర్పాట్లను డీసీపీ రాజేష్‌చంద్ర సోమవారం పరిశీలించారు. కొండపై తూర్పు రాజగోపురం ముందు బ్రహ్మోత్సవ మండపం వద్ద జరిగే కల్యాణ వేడుకకు సంబంధించిన వేదిక, వీవీఐపీ, వీఐపీ, ఆచార్యులు, భక్తులకు సంబంధించిన గ్యాలరీ ఏర్పాట్లను చూశారు. భక్తులు ఎక్కడ నుంచి వస్తారు, వీవీఐపీలు, వీఐపీలు, ఎక్కడ కూర్చుంటారు, శ్రీస్వామి వారి సేవ ఆలయం నుంచి ఎలా అవస్తుందనే అంశాలను ఆలయాధికారులతో చర్చించారు. ఇక కొండపైకి వాహనాలు వచ్చిన సమయంలో ఎక్కడెక్కడ పార్కింగ్ చేయాలనే వాటిపై స్థానిక పోలీసులకు సూచించారు. డీసీపీ వెంట ఏసీపీలు నర్సింహారెడ్డి, సైదులు, సీఐలు సైదయ్య, నవీన్‌రెడ్డి, ఆలయాధికారులు దోర్బల భాస్కర్‌శర్మ, రాజన్‌బాబు తదితరులున్నారు.

శివాలయంలో విశేష పూజలు


మహా శివుడి స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ హోమ మండపంలో తొలుత అగ్ని ప్రతిష్ఠ ఆ తర్వాత రుద్రహవనం చేపట్టారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు గావించారు. శివ గర్భాలయం, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడికి నిత్య కైంకర్యాలు కొనసాగాయి. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.29,16,548 సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వేతనాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం

- బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న గూడూరు నారాయణరెడ్డి

భూదాన్‌పోచంపల్లి : బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వలేని దీనస్థితిలో ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి విమర్శించారు. సోమవారం రాత్రి భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లిలో నిర్వహించిన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను సీఎం కేసీఆర్ ఫ్రీజింగ్ చేయించి కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితబంధు, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని, అందుకోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలపై కనీస ప్రస్తావన తేకపోవడంతో ప్రజా సమస్యలపై ఆయనకున్న చిత్తశుద్ధి తేటతెల్లం అవుతుందన్నారు. శక్తికేంద్రం ఇన్‌చార్జ్ సుర్కంటి రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, కౌన్సిలర్ సుర్కంటి జ్యోతిరంగారెడ్డి, బూత్ అధ్యక్షుడు డబ్బీకార్ సాహేశ్, కొమ్ము రవి, గోదాసు లింగస్వామి, గంజి బస్వలింగం, రమేశ్, వెంకటేశ్, ఒంటెద్దు సత్యం, శేఖర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో నేడు..

యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9గంటలకు శ్రీరామ అలంకారం, హనుమంత సేవ, రాత్రి 7గంటలకు నుంచి గజవాహన సేవ, ఆలయ బ్రహ్మోత్సవ మండపంలో తిరుకల్యాణ మహోత్సవం.





















